క్లుప్తంగా

చదువుతోనే గుర్తింపు

బోథ్: చదువుతోనే గుర్తింపు వస్తుందని వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఏనుగు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నక్కలవాడ, లక్ష్మీపూర్ గ్రామాలో పర్యటించారు. రాత్రిబడిలో భాగంగా 30 రోజుల పాటు చదవడం, రాయడం, నేర్చుకున్న విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రైయినీ కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు వయోజన విద్యలో భాగంగా నేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవ, వయోజన విద్య అడ్మిన్ రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

నేరడిగొండ: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నేరడిగొండ లీడ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోరారు. శుక్రవారం మండల తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. నేరడిగొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ కాలనీకి ఆనుకొని ప్రభుత్వ భూమిలో చేసిన ప్లాట్లను అర్హులైన కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎండీ సద్దాం, సయ్యద్ సాబిర్, సయ్యద్ నసీర్, అర్షద్, అఖిల్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనండి



అవగాహన కల్పిస్తున్న ఆడె గజేందర్

బోథ్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదటి బహుమతిగా స్కూటీ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుర్మే మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి చంటి, అనిల్, బొడ్డు గంగారెడ్డి, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

కామ్రేడ్ డీవీ కృష్ణ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకుడు జగన్ సింగ్ మాట్లాడుతూ.. కార్మిక శాఖలో ఉద్యోగానికి రాజీనామా చేసి విప్లవ ఉద్యమానికి బాటలు వేశారని గుర్తుచేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాష్, పీవైఎల్ నాయకులు ఆత్రం వినోద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, నితిన్, రవీందర్, రాజు, శ్యాంసుందర్, రవి పాల్గొన్నారు.

'పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు'

ఇచ్చోడ: పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్మల్, ఆదిలాబాద్ బైపాస్ రోడ్డు వద్ద ప్రత్యేక పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

నరేశ్ జాదవ్ జన్మదిన వేడుకలు

గుడిహత్నూర్: ఏఐసీసీ సభ్యుడు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు నరేశ్‌జాదవ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, నాగ్‌నాథ్ అప్పా, వసీంఖాన్, రామారావ్, అవినాష్, రమేశ్, కపిల్, రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటరు నమోదుపై అవగాహన

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ద్వారా తమకు నచ్చిన అభ్యర్థులను ఎన్నుకునే అధికారం ప్రజలకు ఉందని సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖజా సిరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24 నుంచి 26 వరకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఓటరు నమోదుకు ఎస్సెస్సీ మెమో జిరాక్స్ తీసుకురావాలన్నారు. సమావేశంలో ఫౌండేషన్ సభ్యులు షేక్ ఇబ్రహీం, ఇమ్రాన్ ఖాన్, తబ్రిజ్ ఖాన్, అస్లాంఖాన్, షేక్ ఇస్మాయిల్, మహ్మద్ సైఫ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సాయం!



విరాళంతో నిర్మించిన తరగతి గది

- గిరిజన గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఔదార్యం
- అదనపు తరగతి గదుల నిర్మాణానికి చేయూత

ఇచ్చోడ: గతకొన్ని రోజులుగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించుకోవడం ట్రెండ్‌గా మారింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి, అందరూ ఒక చోట చేరి చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు. అనాడు చదువు చెప్పినా గురువులను సన్మానిస్తున్నారు. అయితే గిరిజన విద్యార్థులు మాత్రం అందుకు భిన్నంగా ముందుకు వెళ్తున్నారు. తమ చదువుకున్న పాఠశాలకు విరాళం అందచేసి తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 640 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందరికీ సరిపడా తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో పూర్వ విద్యార్థులు తరగతి గదుల నిర్మాణం కోసం ముందుకు వచ్చారు.



విరాళం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల విరాళం..

2022– 23 సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు, 2003–2004లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలిసి రూ. లక్ష యాభై వేలు జమ చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం విరాళం అందచేశారు. విద్యార్థులందించిన స్ఫూర్తితో ఉపాధ్యాయులు కూడా ముందుకు వచ్చారు. ఉపాధ్యాయులు మరో లక్ష జమ చేసి రెండు అదనపు తరగతి గదులను నిర్మించారు. దీంతో పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ లక్షన్నర విరాళంగా ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయం. పూర్వ విద్యార్థులకు రుణపడి ఉంటాం.

– పెందూర్ ప్రనీల్‌కుమార్, విద్యార్థి

ఆలోచన అభినందనీయం



జీవితంలో ఇంకా స్థిరపడకున్నా.. తోటి విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు తీసుకున్న ఆలోచన అభినందనీయం. విద్యార్థులు తీసుకున్న నిర్ణయం ఎంతో మంది గిరిజన విద్యార్థుల్లో వెలుగునింపుతుంది.

– ఆర్. కృష్ణ, ఆర్ట్ టీచర్

అదనపు తరగతి గదుల నిర్మాణం



పూర్వ విద్యార్థుల స్ఫూర్తి ఉపాధ్యాయులను ఆలోచింపజేసింది. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం విరాళం ఇవ్వడం, ఉపాధ్యాయులు కూడా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తిచేశాం.

– రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీ

తలమడుగు: మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. శుక్రవారం ఎంపీపీ లక్ష్మిరాజేశ్వర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 18 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. 9శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. 28 గ్రామపంచాయతీలు ఉండగా.. 9 మంది సర్పంచులే హాజరయ్యారు. దీంతో సమావేశం తూతూమంత్రంగా సాగింది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులు అందేలా చూడాలని సభ్యులు ఏవో మహేందర్‌ను కోరారు. రబీలో కురిసిన అకాల వర్షాలకు 1200 ఎకరాలు పంట నష్టం జరిగిందని, అధికారులు సర్వే చేపట్టిన ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారి హరీశ్ మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సమస్యలపై చర్చించడం కాని పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దివ్య, ఎంపీవో దిలీప్, ఎంఈవో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు దళితుల హక్కు'



దరఖాస్తులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: దళితబంధు దళితుల హక్కు అని కాంగ్రెస్ ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దళితబంధు అప్లికేషన్ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరుపేద దళితులను ఎంపిక చేసి, వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని తహసీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్‌కు అందజేశారు. హుజురాబాద్ ఎన్నికల కోసం మాత్రమే దళితబంధు పథకం ప్రవేశపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో షేక్ ఇమామ్, పెందూర్ అనిల్, షేక్ ఇమామ్, సతీశ్, ప్రవీణ్, దళితులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సాయిరామ కృష్ణశర్మ అన్నారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహాపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బానోతు గజాన నాయక్, ఆలయ కమిటీ సభ్యులు చౌహాన్ మహేందర్, చౌహాన్ సంతోశ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

సమాచారం

సన్మానం

బోథ్: కాంగ్రెస్‌లో చేరబోతున్న మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్ కుమార్‌ను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సేవాలాల్ రాథోడ్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి హరీష్ వర్ధన్‌లు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తన తండ్రి తుల సుభాష్ పేరిట ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతున్న అరుణ్ కాంగ్రెస్‌లోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

పాఠశాలలో పోషకుల సమావేశం

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పోషకుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణపై చర్చించారు. సర్పంచ్ కల్యాణ్ కరుణాకర్ రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ నేతుల గంగన్న, వీడీసీ చైర్మన్ ఆసం రవి, హాస్టల్ వార్డెన్ నర్సింగ్, కాడే స్వామి, ప్రధానోపాధ్యాయులు వినోద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు పులిందలిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా గర్షకుర్తి వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా వేయిగండ్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ ప్రవీణ్, కోశాధికారిగా శ్రీమంగలి సచిన్, చిట్యాల భూమేశ్‌లను ఎన్నుకున్నారు.

ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్..

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ కమిటీని శుక్రవారం మండలంలోని లింగోతండా గ్రామంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాథోడ్ అజయ్, కార్యదర్శిగా విషంరావు, కోశాధికారిగా జాదవ్ రవికిరణ్, సభ్యులుగా సేవదాస్, ప్రకాశ్, సురేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమేశ్, సంతోశ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

26న ధర్నా

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి కట్ట లక్ష్మణాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రొసీడింగ్ అందజేత

బోథ్: మండల కేంద్రంలోని ఖబరస్తాన్ ప్రహరీ నిర్మాణానికి రూ. 4 లక్షల 50 వేల ప్రొసీడింగ్‌ను పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డిలు శుక్రవారం జామ మసీదు అధ్యక్షుడు మౌలానా అఖిల్‌కు అందజేశారు. బీఆర్‌ఎస్ బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, రోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డి విత్తనాలు

తాంసి: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 50 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు, పశుపోషకులు పశువైద్యశాలలో సంప్రదించాలని కోరారు. ఐదు కేజీల విత్తనాల బస్తాకు రూ.120 చెల్లించి తీసుకెళ్లాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో రోడ్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా విద్యుత్ లైన్స్ వేయనున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓల్డ్ హౌసింగ్ బోర్డులోని కాన్వెంట్ స్కూల్, డైట్ గ్రౌండ్, ద్వారకానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

'ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు'

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్‌ఎస్ నాయకులు సాజిదొద్దిన్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డికి వత్తాసు పలికిన కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం ద్రోహం గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. సమావేశంలో అష్రఫ్, శివకుమార్, ప్రశాంత్, రిజ్వాన్ పాల్గొన్నారు.

తాంసి, భీంపూర్ మండలాల్లో వర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అవుతున్నా.. వర్షం జాడలేదు. ఇప్పటికే కొందరూ రైతులు విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూమిపూజ

కైలాస్‌నగర్: పట్టణంలోని ఖానాపూర్ కాలనీలో రూ.3 లక్షలతో నిర్మించనున్న సవారీ బంగ్లా నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శుక్రవారం భూమిపూజ చేశారు. ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను దత్తత తీసుకున్న రిమ్స్ సూపరింటెండెంట్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపరింటెండెంట్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఆయన సతీమణి డాక్టర్ రమలు ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. గ్రామస్తులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల గ్రామంలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉచిత వైద్య సేవలు, మందులు, ఆపరేషన్లు చేసేందుకు ముందుకు వచ్చారు. ఈనెల 25న గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులందరికీ హెల్త్‌కార్డులు అందజేస్తామన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో వీరు నిర్వహిస్తున్న శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో మహిళలకు, గర్భిణులకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. సామాజిక సేవలో భాగంగా ఈనిర్ణయం తీసుకోవడం జరిగిందని వైద్యులు తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అధికారంలోకి రాగానే రుణమాఫీ'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 2 లక్షలు రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాతలు అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్, టెకిడిగూడ, న్యూ చించుఘాట్ గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ అమలు చేసే పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సెడ్మకి ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి ఆటంకం కలిగిస్తే ఊరుకోం

ఆదిలాబాద్‌టౌన్: కిరాయి మనుషులతో కాంగ్రెస్ ప్రచారానికి ఆటంకం కలిగిస్తే ఊరుకోమని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కాంగ్రెస్‌కు కార్యక్రమాలను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పార్టీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సరూర్‌నగర్, వరంగల్ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంతోశ్, శంకర్, కృష్ణరెడ్డి, అశోక్ రెడ్డి, రవికిరణ్, దీపక్, చిత్రు, వెంకటి, చంటి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

జైనథ్: గతంలో ఆత్మహత్య చేసుకున్న ఆదివాసీ రైతు ఎర్మ తులసీరాం కుటుంబానికి కంది శ్రీనివాస్‌రెడ్డి బాసటగా నిలిచారు. ఆయన కుటుంబానికి భరోసానిస్తూ తక్షణ సాయంగా లక్ష రూపాయలను అందజేశారు. పిల్లల చదువు కోసం ప్రతీ సంవత్సరం రూ. 10వేలు ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

'బీజేపీ పాలనలోనే అభివృద్ధి'



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఇచ్చోడ: బీజేపీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడే మానాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రెడ్డి పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో ప్రధాని నరేంద్రమోదీ అనేక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ డి భీం రెడ్డి, బాబారావు పటేలు, మాధవ్ అమ్టె, కొల్లూరి చంద్రశేఖర్, అనిల్ ముర్కుటే పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్‌కాలనీలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బారె నాగరాజు, ఓస సాయికుమార్, రవితేజ, రాజన్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్: దేశంలో అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. బ్యాంకింగ్ వ్యవస్థను పేదలకు అనుసంధానం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కార్యకర్తలు బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నాయకులు రాకేశ్, పవన్, కాంత, రమేశ్, భాగ్యలక్ష్మి, విజయ్ గన్నోజి, వెంకటరెడ్డి, ప్రశాంత్, పవన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కేంద్ర పథకాలే అమలు..

నేరడిగొండ: కేంద్రంలో ఉన్న బీజేపీ పథకాలే తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని నారాయణపూర్, గొలిగూడ, వాంకిడి, రాజురా గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పరశురాం, నాయకులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలు నిరసిస్తూ ధర్నా



రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండల కేంద్రంలో రాత్రి తరుచుగా కరెంట్ కోతలు విధిస్తున్నారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు కరెంట్ లేకపోవడంతో జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని మండిపడ్డారు. ప్రతీరోజు కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రాత్రి 2 గంటలకు కరెంట్ రావడంతో గ్రామస్తులు శాంతించారు.

వ్యవసాయ పనులు ప్రారంభం



దుక్కి దున్నుతున్న రైతు

నేరడిగొండ: వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని పీచర గ్రామంలోని రైతులు బసవన్నలకు పూజలు చేసిన అనంతరం పనులు ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు.



కప్పతల్లి ఆట

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో వర్షాలు కురవాలని అగ్రి ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం కప్పతల్లి ఆట ఆడారు. ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్ చౌక్ నుంచి డప్పుచప్పుళ్లతో అశోక్ రోడ్‌లోని పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి జలాభిషేకం చేసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. వ్యాపారులు వారిపై నీళ్లుపోసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో గండ్రత్ సంతోశ్, దిలీప్, కృష్ణ, భగవాండ్లు, విలాస్, రాజు, శరత్ పాల్గొన్నారు.